క్లుప్తంగా

నేడు ఆచారి పాదయాత్ర

తలకొండపల్లి: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి నేతృత్వంలో బీజేపీ నాయకులు శుక్రవారం మండల పరిధిలోని పడకల్‌లో పాదయాత్ర చేపట్టనున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన గురువారం మాట్లాడారు. మండల పరిధిలోని వెంకటాపూర్ క్రాస్ రోడ్డు నుంచి పడకల్ పంచాయతీ వరకు ఆచారి పాదయాత్ర చేపడుతారని చెప్పారు. నిధులు మంజూరైనా ఈ ప్రాంతం నుంచి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదని.. అందుకు నిరసిస్తూ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆచారి పాదయత్ర చేపడతారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న పాదయాత్రలో మండల పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

యువత రక్తదానం చేయాలి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



రక్తదానం చేస్తున్న యువత

కడ్తాల్: రక్తదానంతో ఆపదలో ఉన్న మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేయాలని సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రాఘవరెడ్డి, పాండురంగారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, డీఎల్‌పీఓ అమృత, ఎంపీడీఓ రామకృష్ణ, ఉపసర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, ఎంపీఓ మధుసూధనాచారి, హెచ్‌ఎం జంగయ్య నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

కడ్తాల్: మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఆలయ నిర్మాణ దాత బోదాస్ మహేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని నిర్వాహకులు కోరారు. ఆలయానికి దివంగత జాల మల్లయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజేశ్..డోర్లు, దర్వాజాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చెప్లతండాకు చెందిన నిరుపేద నేనావత్ జగన్ ఇంటి నిర్మాణానికి ఐక్యతా ఫౌండేషన్ సహకారం అందించింది. ఇటీవల కురిసిన ఈదురు గాలులు, వర్షానికి నేనావత్‌జగన్ ఇల్లు దెబ్బతింది. ఇటీవల చెప్లతండాను ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సందర్శించిన సమయంలో నేనావత్ జగన్ ఇంటిని చూసి ఇంటి నిర్మాణానికి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు నేనావత్ జగన్ ఇంటి నిర్మాణానికి ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి 30 బస్తాల సిమెంట్, ఇతర మెటీరియల్‌ను అందజేశారు.

క్యామ పరామర్శ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మాజీ కౌన్సిలర్ ఎండీ.అబేద్ కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ గురువారం పరామర్శించారు. అబేద్ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలిసిన మల్లేశ్ అబేద్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఇందిరాల రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు బాల్‌రాజ్, ముజకీర్, శశిధరప్ప, జహీర్, కానుగుల మహేశ్, షాకీర్ ఉన్నారు.

విద్యార్థినికి అండగా ట్రస్టు



నందినితో జెడ్పీటీసీ, తదితరులు

తలకొండపల్లి: చదువుల తల్లి నందినికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించాడు. చదువుకుంటనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా చదువును కొనసాగిస్తుండాలని పేర్కొన్నారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన నందిని తండ్రి అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. తల్లి వసంత కూలీ పని చేసుకుంటూ నందినిని పదవతరగతి వరకు చదివించింది. ఇంటర్ విద్య చదివించడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో స్థానిక నాయకుడు జ్యోతయ్య సహకారంతో జెడ్పీటీసీని కలిసి నందిని చదువుకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. స్పందించిన జెడ్పీటీసీ.. ఆమనగల్లు కృష్ణవేణి కళాశాల యజమాన్యంతో మాట్లాడి గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేర్పించారు. సర్పంచ్‌లు లలితమ్మ, లక్ష్మణ్, జ్యోతయ్య, సింగిల్ విండో డైరెక్టర్ దేవులానాయక్, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో విఫలం



ఆమనగల్లు పట్టణం వ్యూ

- స్థానికంగా అందుబాటులో లేని ప్రభుత్వ కార్యాలయాలు
- జిల్లాల పునర్విభజనతో ఆమనగల్లు ప్రజలకు ఇబ్బందులు
- ప్రతి పనికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఆమనగల్లు: పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడేళ్ల క్రితం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాలో విలీనం చేశారు. అయితే అందుకు అనుగుణంగా వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో నాలుగు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలో ప్రజలకు అవసరమైన డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలిపోయాయి. దీంతో ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పునర్విభజనతో...

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పునర్విభజనలో భాగంగా నూతనంగా ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లోని పలు గ్రామాలను కలిపి కడ్తాల మండలం ఏర్పాటు చేశారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను రంగారెడ్డి జిల్లాలో విలీనం చేశారు. అంతకుముందు కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో మూడు మండలాల ప్రజలకు వివిధ డివిజన్ కార్యాలయాలు అందుబాటులో ఉండేవి. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను రంగారెడ్డి జిల్లాలో కలిపినందున ఆమనగల్లు మండలంలో వివిధ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని అప్పట్లో ప్రజలు కోరారు.

వివిధ ప్రాంతాల్లో కార్యాలయాలు...

పునర్విభజన అనంతరం ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాలను కందుకూరు ఆర్డీఓ పరిధిలో చేర్చగా మాడ్గుల మండలాన్ని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ పరిధిలో చేర్చారు. కడ్తాల, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్టర్, వ్యవసాయ శాఖ ఏడీఎ కార్యాలయాలు మహేశ్వరంలో, మాడ్గుల మండలానికి ఆయా కార్యాలయాలు ఇబ్రహీంపట్నంలో ఉన్నాయి. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు పోలీసు శాఖ ఏసీపీ కార్యాలయం, ఆర్టీఓ కార్యాలయం షాద్‌నగర్‌లో ఉండగా మాడ్గుల మండలానికి ఏసీపీ ఇబ్రహీంపట్నంలో, ఆర్టీఓ కార్యాలయం రాగన్నగూడలో ఉన్నాయి. ఒక్కోచోట ఒక్కో కార్యాలయం ఉండటంతో నాలుగు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఒకేచోట ఏర్పాటుకు డిమాండ్.

ఆమనగల్లు పట్టణంలో అన్ని డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నాలుగు మండలాల ప్రజలు కోరుతున్నారు. వివిధ పనులపై ప్రజలు డివిజన్ కార్యాలయాలకు వెళ్లాలంటే తీవ్ర వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఆమనగల్లు పట్టణంలో సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, ఆర్టీఓ, ఏసీపీ, వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. జిల్లాల పునర్విభజన అనంతరం ఒక్క ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటు చేశారు. పునర్విభజనలో భాగంగా ఏర్పాటు చేసిన కడ్తాల మండలంలో కూడా సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిదులు, అధికారులు చొరవ తీసుకుని ఆమనగల్లు పట్టణంలో అన్ని కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించలేదు



ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన చేపట్టింది. అయితే దీనివల్ల ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు మండలాలను రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించలేదు. ఆమనగల్లు పట్టణంలో వివిధ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలి.

– నర్సింహ, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

ప్రజాప్రతినిధులు స్పందించాలి



జిల్లాల పునర్విభజనతో స్థానికంగా కార్యాలయాలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. పునర్విభజనతో సౌకర్యాలు మెరుగుపడతాయని భావించిన ప్రజలకు కొత్త ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రజాప్రతినిధులు స్పందించి డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు కృషిచేయాలి. త్వరగా సమస్యలు పరిష్కరించాలి.

– అర్జున్‌రెడ్డి, వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి

ప్రతిపాదనలు పంపించాం



ఆమనగల్లు మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కృషి చేస్తున్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఆయా కార్యాలయాల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆమనగల్లులో కోర్టు ఏర్పాటు చేయడం జరిగింది. త్వరలో అన్ని డివిజన్ కార్యాలయాలను ఒకేచోట చేరుస్తాం.

– పత్యానాయక్, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో ఎమ్మెల్యే పర్యటించి రూ.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.42లక్షలతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ శంకర్‌తో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ శంకర్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ అనిల్, నాయకులు నర్సింహగౌడ్, కృష్ణయ్య, లక్పతినాయక్, రమేశ్‌నాయక్, రాజుగౌడ్, కుమార్, జగన్‌గౌడ్, కార్యదర్శి హరీశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీకి కృషి

చైర్‌పర్సన్ ఆర్తిక గౌడ్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ఆర్తిక

ఇబ్రహీంపట్నం రూరల్: అభివృద్ధిలో ఆదిబట్ల మున్సిపాలిటీని జిల్లాలోనే అగ్రగామిగా నిలుపుతానని చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక చెప్పారు. 14, 7వ వార్డులో రూ.54 లక్షలతో చేపట్టిన అండర్ డ్రైనేజీ, సీసీరోడ్లు నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోనే మున్సిపాలిటీ ఆదర్శంగా నిలిచిందన్నారు. అత్యధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని, ప్రస్తుతం సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టామని, వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణం చేస్తున్నామని ఆమె తెలిపారు. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్త యాదగిరిగౌడ్, యూత్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, జంగయ్య, సురేష్, రమేష్, రాముగౌడ్, వసంత, పరమేశ్, గణేశ్, కేశవులు, రాజు, శ్రీనివాస్, మహేందర్, నర్సింహ, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువ పత్రాలకోసం దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుచరిత, సిబ్బంది

ఒక్కరోజే 600 అర్జీలు

యాచారం: బీసీ వెల్ఫేర్ కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం కోసం లబ్ధిదారులు మీ సేవ కేంద్రాలకు బారులు తీరుతున్నారు. అందుకు అవసరమైన ధ్రువ పత్రాలు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తున్నాయి. ఈ నెల 20 వరకే చివరి తేదీ కావడంతో బీసీకి చెందిన వారు అర్జీ పెట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా ధ్రువ పత్రాల జారీకి యాచారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయగా.. గురువారం ఒక్క రోజే 600 అర్జీలు వచ్చాయి. అత్యవసర పనులు మినహా మిగితా పనులన్నీ పక్కకు పెట్టి తహసీల్దార్ సుచరిత సర్టిఫికెట్ల జారీపైనే దృష్టి సారించారు.

గాడివంపు వాగు ఆనకట్ట నిర్మాణం చేపట్టాలి



మాట్లాడుతున్న ధర్మానాయక్ తదితరులు

మంచాల: రైతాంగానికి మేలు చేసే గాడివంపు వాగు ఆనకట్టను నిర్మాణం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ కోరారు. గురువారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తండాలో ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మానాయక్ మాట్లాడుతూ.. 2003 నుంచి గాడివంపు వాగుపై అనకట్ట నిర్మాణం పనులు చేస్తామని పాలకులు చెప్పడం తప్ప చేసిన దాఖలాలు లేవన్నారు. 2003లో అప్పటి హోంశాఖ మంత్రి దేవేందర్ గౌడ్ ఆనకట్ట నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. వాగుపై అనకట్ట నిర్మాణం చేయడం వల్ల పది గ్రామాల్లో రైతులకు సాగు నీటి సమస్య తీరుతుందన్నారు. ఇప్పటికైనా గాడివంపు వాగుపై ఆనకట్ట నిర్మాణం చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. యాదయ్య,మండల నాయకులు రాజు, చందునాయక్, శ్రీనివాస్, రఘువీర్, సీతారాం,లచ్చు పాల్గొన్నారు.

నేడు పట్టణ ప్రగతి దినోత్సవం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆమనగల్లు పట్టణంలో జాతీయ పతాకావిష్కరణ అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. స్థానిక శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించే వేడుకల్లో మున్సిపాలిటీ పాలకవర్గం, ఉద్యోగులకు సన్మానం, కార్మికులకు అవార్డుల బహూకరణ ఉంటుందని తెలిపారు.

పంచాయతీకి స్థలం బహూకరణ

దాతను సన్మానించిన పాలకవర్గం



కృష్ణను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

తలకొండపల్లి: గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు కొర్ర కృష్ణను ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని గడ్డమీది తండాలో శాశ్వత గ్రామ పంచాయతీ భవనం లేదు. ఈ నేపథ్యంలో ఇదే పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు కొర్ర కృష్ణ నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.5 లక్షలు విలువ చేసే 250 గజాల స్థలాన్ని పంచాయతీకి విరాళంగా అందజేశాడు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వచ్ఛంధ సంస్థల కార్యకర్తలు గురువారం కృష్ణను అభినందించారు. ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్, ఎంపీటీసీ సరిత, గణేషుగుప్తా, ఉప సర్పంచ్ శేషానాయక్, శ్రీరామ్, రమేష్, దశరథ్, జంగయ్య, చక్రి, భీమ్లా, భామిని, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల సీఐగా కాశీవిశ్వనాథ్



మంచాల: మంచాల సీఐగా కాశీవిశ్వనాథ్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల మంచాల సీఐగా పనిచేసిన బత్తిని వెంకటేశం బదిలీకావడంతో ఆయన స్థానంలో పహాడీషరీఫ్ సీఐగా పనిచేస్తున్న కాశీవిశ్వనాథ్ మంచాలకు బదిలీ అయ్యారు. తాజాగా ఆయన గురువారం బాధ్యతలను తీసుకోవడం జరిగింది.

ఫార్మాసిటీ సీఐగా రామాంజనేయులు



యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ మొట్టమొదటి సీఐగా రామాంజనేయులు నియమితులయ్యారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై రామాంజనేయులు ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఫార్మాసిటీ ఇన్‌చార్జి సీఐగా ఉన్న యాచారం సీఐ లింగయ్య గురువారం రామాంజనేయులుకు బాధ్యతలు అప్పగించారు.

'లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం'



అంబలి అందజేస్తున్న క్లబ్ సభ్యులు

కడ్తాల్: లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రం.. 45రోజులుగా పేదలు, ప్రయాణికుల ఆకలి దప్పిక తీరుస్తోంది. ప్రధాన కూడలిలో ఉన్న ఈ కేంద్రానికి ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు బాటసారులు, స్థానికులు బారులు తీరుతున్నారు. ఈ మేరకు గురువారం అంబలి కేంద్రాన్ని లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటేశ్, బీచ్యానాయక్, దోనాదుల మహేశ్ సందర్శించి పలువురికి అంబలి పంపిణీ చేసి మాట్లాడారు. మండుటెండలో 45రోజులుగా అంబలి కేంద్రాన్ని నిర్వహిస్తూ, రోజుకు 400 మందికి పంపిణీ చేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు యాదయ్య, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వ్యవసాయ మీటర్ల బిల్లులు చెల్లించాలంటూ..

- ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేత
- ఉప్పరిగూడలో అధికారుల వింత పోకడ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన పోరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు 20 సంవత్సరాల క్రితం తనకు ఉన్న వ్యవసాయ భూమిని ఇతరులకు అమ్మేశారు. అప్పట్లో మొత్తం విద్యుత్ బిల్లులు చెల్లించారు. కానీ గురువారం విద్యుత్ శాఖ అధికారులు వచ్చి మీ వ్యవసాయ మీటరు బిల్లు రూ.6 వేలు ఉందని బిల్లు కట్టాలని ఒత్తిడి చేశారు. మాకు భూమి లేదు అమ్ముకున్నాం. బిల్లు ఎలా కట్టడం అని అడిగితే ఇంటి విద్యుత్ సరఫరా కట్ చేశారు. ఉక్కపోతకు పొద్దంతా చెట్ల కిందే చిన్నపిల్లలు ఉండాల్సిన దుస్థితి నెలకొందని బోరున విలపించాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో యేండ్ల తరబడిగా ఉన్న వ్యవసాయ బాయి విద్యుత్ బకాయిలు వసూలు చేయడానికి వచ్చారు. వీరిలో గ్రామానికి చెందిన 20 మందికి పైగా రైతులు చెల్లించాల్సి ఉండగా అందరి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రశ్నించారు. బిల్లులు పేరుకుపోయాయని ఇల్ల విద్యుత్ మీటర్లకు సరఫరా అయ్యే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో కొంతమంది డబ్బులు చెల్లించగా వారికి విద్యుత్ పునరుద్ధరించారు. 15 మందికి పైగా భూములు అమ్ముకోవడం, డబ్బులు లేకపోవడంతో డబ్బులు చెల్లించలేదు. దీంతో వారి ఇళ్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో వారంతా రాత్రంతా అంధకారంలో మగ్గారు. చిన్నపిల్లలతో సహా రాత్రంతా జాగారం చేశారు. వ్యవసాయ మీటర్ల విద్యుత్ బకాయిలకు ఇండ్ల విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఎంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు అంటున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

బీజేపీ నేతల నిరసన దీక్ష

తలకొండపల్లి: మండలంలోని వెంకటాపూర్ క్రాస్ రోడ్డు నుంచి పడకల్ పంచాయతీ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గురువారం దేవునిపడకల్‌లో మండల బీజేపీ నాయకులు నిరసన దీక్షలు చేపట్టారు. దీక్షకు మద్దతుగా బీజేవైఎం నాయకులు మద్దతు తెలిపారు. నిధులు మంజూరైన రోడ్డు నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని పలుమార్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కొబ్బరికాయలు కొట్టి పూజలు చేయడమే తప్ప పనులు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతుకుల రోడ్డుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా మమత్‌ఖాన్ చెరువు కట్ట పునఃనిర్మాణపు పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, కృష్ణగౌడ్, సాయిరాం, మల్లేష్, గణేష్‌గౌడ్, రాజు, మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న పల్లెలు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో పల్లెప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పల్లెప్రకృతి వనం తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. పల్లెప్రగతి ద్వారా జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, హరితహారం, నర్సరీల ఏర్పాటు, చెత్త సేకరణ వంటి వాటితో పల్లెలు పరిశుభ్రంగా మారాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు.

– సాక్షి, నెట్‌వర్క్



యాచారం: పంచాయతీ సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి



కడ్తాల్: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సన్మానించిన సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి



తలకొండపల్లి: పంచాయతీ సిబ్బందిని సన్మానించిన ప్రజాప్రతినిధులు



ఇబ్రహీంపట్నం: సఫాయి కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ పవిత్ర



అబ్దుల్లాపూర్‌మెట్: పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన ప్రజాప్రతినిధులు



ఆమనగల్లు: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శ్రీనునాయక్